# స్పెషల్ షాట్

• పుట్టగుంట గోపీచంద్

## నాంది

''సుకన్యా! రేపు గుంటూరులో క్రికెట్ మాచ్ వుంది. వెళ్తావా?'' సురేషంకుల్ ఫోన్ చేసి ప్రత్యేకంగా అడిగాడు.

సుకన్య చప్పున ''వెళ్లనంకుల్ నా కింట్రెస్ట్ లేదు'' అనేసింది. ఆమెకు క్రికెట్ అంటే అస్సలు పడదు.

''నీ మొఖం, వెళ్ళడానికేమైంది. వెయ్యి రూపాయిల టిక్కెట్లు, మంచి కన్వీనియెంట్ సీట్లు, చక్కా వెళ్ళి చూసొచ్చేదానికి వెళ్ళనంటావేంటి?'' అన్నారు సురేషంకుల్

సుకన్య పక్కనే కూర్చుని వున్న ఆమె స్నేహితురాళ్ళు సుకన్య చెప్పిన సమాధానం వినీ వినడంతోనే సంగతి అర్థమయి సుకన్య చేతిలోని రిసీవర్ అమాంతం లాక్కుని ''వెళ్తామంకుల్... వెళ్తాం... మొత్తం నలుగురం వున్నాం'' అంటూ గోలచేశారు.

సురేషంకుల్ నవ్వుకుని ''సరే అమ్మాయిలూ! నాలుగు వెయ్యి రూపాయిల టిక్కెట్లు పంపిస్తాను. మీరు ప్లేయర్స్‌ని చాలా దగ్గరగా చూసే వీలున్న సీట్లవి. మీకే ఇబ్బందీ కలగదు. చక్కా ఎంజాయ్ చేస్తూ చూడొచ్చు'' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.


## అసలు కథ ప్రారంభం

సుకన్య కెమేరాతో ఏడున్నరకల్లా రెడీ అయిపోయింది. ఆమెకు క్రికెట్ చూడడం కన్నా పక్కనుంచి బాట్ ఊపుకుంటూ వెళ్ళే ఆటగాళ్ళను ఫోటోలు తీయడమే ఎక్కువ ఆనందంగా అనిపిస్తోంది. వాళ్ళవి సర్వసామాన్యమైన టిక్కెట్లు కావు. వెయ్యి రూపాయిలవయ్యే.

గౌరి టిఫెన్ బాక్సుతో ఎనిమిదింటికల్లా రెడీ అయిపోయింది. మాచ్ మధ్యలో ఆకలేసి అంతరాయం కలగడం ఆమెకు సుతరాం ఇష్టం వుండదు.

మాధవి టీ నింపిన ఫ్లాస్క్, వాటర్ బాగ్‌లతో తొమ్మిదింటికి ఇంటినుంచి బయటపడింది. మధ్య మధ్యలో టీతో గొంతు తడపందే అదరగొట్టే ఈలలు నోటి నుంచి పుట్టవు.

సుప్రియ ఆటోగ్రాఫ్ పుస్తకంతో తొమ్మిదిన్నరకి బయలుదేరింది. ఆమె ఐదింటికే లేచింది. కాని మేకప్ పని తెమిలేసరికి ఆలస్యమైంది. ఆమె ఆటోగ్రాఫ్ పుస్తకంలో ఈ పూట కనీసం పదిహేను సంతకాలన్నా పడాలి.



మొత్తానికి అంతా పది గంటలకు విజయవాడ బస్‌స్టాండులో కలుసుకున్నారు. గుంటూరు నాన్ స్టాప్ బస్ టిక్కెట్లు తీసుకుని బస్సెక్కారు.

ఆ బస్సు ప్రయాణం నలభై ఐదు నిమిషాలు.

ఎక్కగానే బస్సు కదలలేదు.

ఓ పావుగంట గడిచాక అది తాపీగా కదిలింది. వేసవి వచ్చేస్తూండడంతో బాగా ఉక్క పోస్తోంది.

సుప్రియ మేకప్ చెదిరిపోకుండా విసురుకుంటోంది. 'అది కానీ చెదిరిపోతే తనకేసి గవాస్కరూ చూడడు.. వెంగ్సర్కారూ చూడదు' అనుకుంటోంది.

బస్సు కదలగానే గౌరి తానెప్పుడో స్పోర్ట్స్ స్టార్‌లో

కపిల్‌దేవ్‌కి ఇష్టమైన వంటకాలేవో చదివినట్లు గుర్తు కొచ్చి ఇక ఆ వంటల గురించి చెప్పసాగింది.

మాధవి రోజర్ బిన్నీ మొఖానికి రోజర్ మూర్ మొఖానికి లేని పోలికలన్నీ వున్నాయని, గవాస్కర్ కమల్‌హాసన్‌లా వుంటాడని, వెంగ్సర్కార్ వెంకటేష్‌లా వుంటాడని ఎవరూ వాదనకు దిగకపోయినా వాదిస్తో న్నట్లు చెప్పసాగింది.

సుకన్య వాళ్ళ వెర్రి మొఖాలను, ఆ మొఖాలలో కలిగే విపరీత హావభావాలను చూస్తూ కూర్చుంది.

బస్సు పావుతక్కువ పదకొండు గంటలకు గుంటూరు బస్‌స్టాండులో ఆగింది.

గాళ్ళు కిందకు దిగారు.

"ఆటో కావాలా?"

"రిక్షా కావాలా?"

"టాక్సీల్లేవా? కనీసం హెలికాప్టర్ కూడా లేకుండా ఎలా?" అంటూ విరుచుకు పడింది సుకన్య ఎదురు













అడ్డుగా నిలబడిన వాళ్ళ మీద.

అంతే... వాళ్ళు తప్పుకుని దారిచ్చారు.

"లేకపోతే బస్‌స్టాండ్‌కి, బ్రహ్మానందరెడ్డి స్టేడియంకి ఎంత దూరం? వాకింగ్ డిస్టెన్స్ కదూ? నడవడంతా?" అని గదమాయించింది సుకన్య.

గాళ్ళు మారు మాట్లాడకుండా ముందుకు నడిచారు.

గ్రౌండ్స్ దగ్గర పడుతూన్న కొద్దీ నలుగురిలో ఉత్సాహం పెరుగుతోంది. తమ దగ్గరున్న కార్డులు సామాన్యమైనవి కావు. వెయ్యి రూపాయిలవి. అక్కడ రాజసం ఒలకబోస్తూ వెళ్ళిదర్జాగాకూర్చోవచ్చు. ప్రత్యేక కార్డులతో వచ్చిన తమను చుట్టుపక్కల వాళ్ళు కుతూహలంతో చూస్తారు. చాలు... అది చాలు కాస్తంత గర్వం మొఖంలో చూపెట్టడానికి.

గాళ్ళు ఎలిజబెత్ టేలర్లా నడవడం మొదలు పెట్టారు.

ఎదురుగా సుస్వాగతం అన్న బోర్డ్ కనిపించింది. ద్వారానికి చెరోవెయిపు గవాస్కర్, కపిల్‌దేవ్ బొమ్మలు నవ్వుతూ కనిపించాయి. వాటిని చూడగానే సుప్రియ అందంగా సిగ్గుపడింది. వాళ్ళిద్దరూ తననే గుచ్చిగుచ్చి చూస్తున్నట్టుగా ఫీలయింది పిచ్చిపిల్ల.

అక్కడంతా పోలీసుల మయంగా వుంది. లోపలికి వెళ్ళే వాళ్ళెవరూ కనిపించడం లేదు.

గాళ్ళు అడుగు ముందుకేశారు.

అరడజను లాఠీలు అడ్డొచ్చి ఆపేశాయి.

"ఏం? ఎందుకాపుతున్నారు? తియ్యండే మన కార్డులు?" అంది సుకన్య.

అంతా స్టెన్‌గన్‌లు తీసినట్టు వెయ్యి రూపాయిల కార్డులు పర్సుల్లోంచి బయటకు తీశారు.

కానీ వాటిని కాకరపువ్వొత్తులకన్నా హీనంగా చూస్తూ కానిస్టేబుల్స్ "లోపల గ్రౌండంతా ఫుల్ అయిపో యింది. లోపలికి పంపించడం లేదు" అన్నారు.

"మావి వెయ్యి రూపాయిల టిక్కెట్లు"

"మాకనవసరం. లోపలకు ఎవరినీ పంపించొద్దు అన్నారు."

"అనడానికి వాళ్ళెవరు? మేం లోపలకు వెళ్ళి తీరాలి."

"వెళ్ళడానికి వీల్లేదని చెప్పడంలా. వెళ్ళిపొండి... వెళ్ళిపొండి."

సుకన్య వాళ్ళ పిడత మొఖాల మీద లాంగ్ కిక్ ఒక్కటివ్వాలనిపించి బలవంతాన ఆపుకుంది.

"మరి మేం వెళ్ళిపోవాల్సిందేనా?" అంది గౌరి.

"అవును. వచ్చిన దారినే తిరుగు ముఖం పట్టండి. అదుగో దూరంగా నిలబడ్డ ఆ జనాలంతా కూడా వందలూ, ఏభైలూపోసి టిక్కెట్లు కొనుక్కున్న వాళ్ళే."

సుకన్యకు ఊపిరాడలేదు. కోపంతో ముక్కుపుటాలు పెద్దవయ్యాయి. చుట్టూ చూసింది.

దూరంగా జింగిరి మొఖం వేసుకుని వున్న పోలీస్

ఇన్‌స్పెక్టర్ కనిపించాడు.

సుకన్య వప్పున నాలుగు కార్డులూ తీసుకుని అతడి దగ్గరకు పోయి "నాలుగువేలు తగలేసి కొన్నాం వీటిని మేము. విజయవాడ నుంచి రావడంతో ఆలస్యమైంది. ఇప్పుడు మేం మాచ్ చూడకుండా వెళ్ళడం మీకు ఆనందంగా వుంటుందా? సంతోషంగా ఫీలవుతారా?" అనడిగింది.

అతడు ఆమె మొఖంలోకి చూసి "లాభం లేదు మేడమ్. లోపల కెవరినీ అడుగు పెట్టనియ్యొద్దని ఆర్గనైజర్ షరతు" అన్నాడు.

"ఎవడా ఆర్గనైజర్? మా నాలుగువేలూ వట్టేట్లో కలవాలనా? కొనుక్కుంటే నాలుగు పసందైన పట్టు చీరలొచ్చేవి?"


"అదంతా నాకు తెలీదు. ఆర్గనైజర్‌ని అడగండి. అతను పంపించమంటే పంపిస్తాను"

"అయితే ఆ ఆర్గనైజర్‌ని పిలవండి" అంది.

దూరంగా ఉక్రోషం, రోషం, నిరాశతో నిల బడ్డ జనాల్లోంచి ఒకడు "ఇక్కడ బయటెందుకుంటాడు. ఈ పాటికి గవాస్కర్ బూట్లు దుమ్ము దులుపుతుంటాడని నా అనుమానం" అన్నాడు.

"అయితే నన్నేం చేయ్యమంటారు?" అన్నాడా ఇన్‌స్పెక్టర్ నిస్సహాయంగా. అతడికీ ఆర్గనైజర్ గంట నుంచి కనబడడం లేదు.

"లోపలికి పంపండి" గాళ్స్ కోరస్‌గా అన్నారు.




ఇన్‌స్పెక్టర్ ఏడుపు మొఖం పెట్టుకుని లోపలకు పంపించాడు.

సుకన్యకు సెంచరీ చేసినంత ఆనందం కలిగింది.

ఆమెకు అక్కడ గౌరి, మాధవి, సుప్రియ కన్నా పరమ పిచ్చాళ్ళు చాలా మంది కనిపించారు. వాళ్ళంతా ఆటను కట్నం తీసుకోని పెళ్ళికొడుకు ల్లాగానూ, ఏ ఇంధనం లేకుండా నడిచే స్కూటర్ లాగానూ చాలా అపురూపంగా, ఆప్యాయంగా ఎగురుకుంటూ చూస్తున్నారు.

అక్కడ మన వాళ్ళ కోసం ఏ ఉచిత సింహాసనాలూ కానరాలేదు. అసలక్కడ కూర్చోడానికే ఖాళీ లేనంతగా కిక్కిరిసి పోయివుంది.

జనాల మధ్యలోంచి ఎగురుకుంటూ వెళ్ళి వెనక వైపెక్కడో వున్న కాస్తంత ఖాళీ జాగా చేసుకుని కూర్చున్నారు.

అప్పటికింకా ఐదు వోవర్లే మిగిలాయి.

అప్పుడే గవాస్కర్ బ్యాటింగ్‌కి వచ్చాడు. నెత్తిమీద నీలం చారవున్న టోపీ చక్కగా కనిపిస్తోంది.

"అయ్యో!" అంటూ సుప్రియ ఒక్కసారిగా మతి చెలించిన దాన్లా గావుకేక పెట్టింది. కానీ ఆ కేకకు గవాస్కర్ అవుటయిపోయి జనాలు అరవడంతో ఆ అరుపు జనాల అరుపులో కలిసిపోయింది.

అప్పటిదాకా మేమే కింగ్‌లం అనుకుంటూ కేకలు పెడుతున్న చుట్టుపక్కల వాళ్ళు బలమైన ప్రత్యర్థి తాకిడికి కాస్త తగ్గారు.

"ఎందుకే అలా అరిచావు?" అడిగారు మిగతా అమ్మాయిలు.

"బై...నా...క్యు...ల...ర్స్!" సుప్రియ తనగుండె పారేసుకున్నంత బాధగా అంది.

"పోతే పోయిందిలే"

"పోవడం కాదు. అసలు తేలేదు."

"వోర్చుకుని చూడు" చిరాగ్గా అన్నారు.

"కుదరదు. అలా వుండలేను. దూరంగా వున్న ఆ పిచ్‌లో నా గవాస్కరెక్కడున్నాడో? వెంగ్సర్కార్






## పురాణ కథల క్విజ్ -12 ఫలితాలు

* పశుపతి ఎవరు? : పరమ శివుడు
* శ్రీకృష్ణుడి స్పర్శతో తొండ రూపం నుంచి విముక్తుడైన రాజు : నృగుడు
* కైకేయి దాసి పేరు : మంధర
* శ్రీకృష్ణుడి నగరం ఏది? : ద్వారక
* కంసుడి తల్లి పేరు చెప్పండి? : సువర్చస

*గడువు తేదీ నాటికి మాకు చేరిన 420 ఎంట్రీల నుంచి సరైన జవాబులు పంపిన పాఠకులలో ఈ క్రిందివారిని లాటరీ ద్వారా విజేతలుగా ఎంపిక చేశాము. విజేతలకు గీత్ మాల (ప్రి-రికార్డెడ్ ఆడియో క్యాసెట్ డీలర్లు, విజయవాడ) వారు 'భారతంలో చిన్న కథలు' క్యాసెట్లను రిజిస్టర్డ్ పోస్టులో నేరుగా పంపుతారు. క్రిందటివారం (1-4-88) సంచికలో ప్రచురించిన పురాణ కథల క్విజ్‌ను క్విజ్-13గా గమనించవలసిందిగా మనవి. 13వ క్విజ్‌తో ఈ పురాణ కథల క్విజ్ శీర్షిక ముగుస్తుంది. ఈ శీర్షికలో ఇంతవరకు బహుమతులు అందుకోని విజేతలు తమ చిరునామా, తాము గెలుపొందిన క్విజ్ నెంబర్లు మాకు వ్రాయవలసినదిగా కోరుతున్నాము.*

—ఎడిటర్

1. బి. రత్నా విద్యాధర్, భువనేశ్వర్ (ఒరిస్సా)
2. ఎ. విజయలక్ష్మి, హైదరాబాద్
3. ఎ. రామప్రసాద్‌బాబు, వేటపాలెం

**ఆడియో క్యాసెట్లతో పాటు మరింత విస్తృత శ్రేణిలో**
**మరెన్నో ఆకర్షణీయమైన బహుమతులతో**
**గీత్ మాల అతి త్వరలో మీ ముందుకు వస్తుంది.**
**వివరాలకు వచ్చే సంచిక చూడండి!**

ఎక్కడున్నాడో? నాకు సరిగ్గా కనిపించనే కనిపించడం లేదు'' అని వాపోయింది సుప్రియ.

విచారంగా చుట్టూ కలయజూసింది.

ముందు వరసలో వున్న వో అమ్మాయి గార్డెన్ వరేలీ శారీస్ మోడల్ పెర్సిస్ కంభట్టా లెవల్‌కి ఏ మాత్రం తగ్గకుండా బైనాక్యులర్స్ లోంచి చూస్తోంది. దూరంగా వెంగ్సర్కార్! అతడి మీసాలు కనిపించగానే ఒళ్ళంతా చక్కిలిగింతలు పెడుతున్నట్టుగా పరవశించి పోతోంది.

తాను పొందాల్సిన మధురానుభూతులు ఇంకో అమ్మాయి పొందడం సుప్రియకు నచ్చలేదు. 'ఆ అమ్మాయి చేతిలోని దాన్ని విరక్కొట్టయినా కొట్టాలి లేదా దౌర్జన్యంగా లాక్కోయినా లాక్కోవాలి' అనిపించింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది తానొక ఆటోగ్రాఫ్ బుక్ తెచ్చానని. ఇక దాన్ని తెరిచి చేత్తో పట్టుకుని కూర్చుంది. ఎందుకంటే ప్లేయర్స్ గ్రౌండ్‌లోకి వెళ్ళడం, అవుటయి రావడం అంతా వాళ్ళ పక్కనున్న మార్గం గుండానే కాబట్టి. అంతే... కలకనడం మొద లెట్టింది.

### డ్రీమ్

లోపలికి వెళుతూ కపిల్‌దేవ్ ఆగిపోయాడు. సుప్రియ అందం అతడి ముందరి కాళ్ళకు బంధం వేసింది. అతడు మెరుపులు కురిసే కళ్ళతో ''హలో! మిస్! మీరు మరోలా అనుకోకపోతే మీకు నా ఆటోగ్రాఫ్ ఇవ్వాలనుంది'' అని అడిగాడు.

సుప్రియ చిన్నగా నవ్వుకుని ''దాన్దేముంది. ఇవ్వండి?'' అంది.

''మిస్! మరి నేను!!'' ఎప్పుడొచ్చాడో ఏమో గవాస్కర్ అతడి వెనకే నిలబడి కుళ్ళుమోత్తనంతో చూస్తూ అడుగుతున్నాడు.

సుప్రియకు అతడి మనసు నొప్పించడం ఇష్టం లేక ''భలేవారే! మీరూ ఇవ్వండి'' అంది.

''సుప్రియకు నా ఆటోగ్రాఫ్ వద్దా?'' చెవుల వెనుకగా ఎవరిదో గుసగుస వినిపించింది.

తలతిప్పి చూస్తే వెంగ్సర్కార్.

సుప్రియకు ఇక విసుగు పుట్టింది. ఎంత మంది దగ్గరని తను మాత్రం ఆటోగ్రాఫ్ తీసుకుంటుంది?

ఇక వెంటనే చిరాగ్గా ''అబ్బ ఏంటీ గోల? ఎక్కడా ఆర్గనైజర్లు? వీళ్ళిలా విసిగిస్తూంటే ఎక్కడ చచ్చారు?'' అంది.

### వాస్తవం

ఒక్కసారిగా మీద పడ్డ మనుషుల ధాటికి సుప్రియ కళ్ళు తెరిచింది. తన మీదుగా ఎగురుకుంటూ చూస్తోన్న గౌరి, మాధవి కనిపించారు.

గవాస్కర్ అవుటయి వీళ్ళ పక్కనే వెళుతూండడంతో రేగిన కలకలం ఇది. అతడు ఇంతకు ముందు వచ్చిన దారి వయిపు కాకుండా ఇంకో దారి వయిపు వెళుతున్నాడు. ఆదారి మనవాళ్ళు కూర్చున్న ఎడం పక్కనుంచే. దాంతో జనాలకు జామ చెట్టు మీదెక్కిన కోతుల్లా పరమ ఉత్సాహంగా ఎగురుకుంటూ గవాస్కర్ జుత్తు చివర్లు కనిపించినా పరవశించి పొంగిపోతూ చూస్తున్నారు.

గవాస్కర్ తల తిప్పలేదు.

ఎవ్వరికేసి చూడలేదు.

మకుటంలేని మహారాజులా వెళ్ళిపోయాడు.

గౌరి ఆవేశంగా వో కప్పు టీ తాగేసింది.

మాధవి సమోసా కసిగా కొరికి తింది.

సుకన్య తన కెమేరా లెన్స్‌ల కందని గవాస్కర్ రూపం గుర్తుకు తెచ్చుకుని నిరుత్సాహ పడింది.

సుప్రియ 'తన మనసే వెళ్ళిపోయిందా?' అన్నట్టు కకావికలమైన మనసుతో చూసింది. చేతిలోని ఆటోగ్రాఫ్ వెక్కిరిస్తూ కనిపించింది.

గవాస్కర్ టీమ్ వోవర్లు అయిపోయి, రెండు టీములూ పావుగంట విశ్రాంతి కోసం లోపలకు వెళ్ళాయి.

గాళ్స్ తెచ్చుకున్న టిఫిన్ లాగించి, టీ తాగేసరికి తిరిగి రెండు టీమ్లూ బరిలోకి దిగాయి.

సమయం గడుస్తూంది.

ఆట జరుగుతోంది.

ఆటోగ్రాఫ్‌లో ఒక్క సంతకం పడలేదు.

సుప్రియలో నిరాశ ఆవేశంగా మారింది.

ఆశ ఆక్రోశించింది.

తీరని కోరిక తిరుగుబాటు చేసింది.

అంతే... కోపం వచ్చి సుప్రియ ఆటోగ్రాఫ్ పుస్తకం మొత్తం తానే ఆటోగ్రాఫ్‌లు పెట్టేసుకుంది.

'ఇంకో డ్రీమ్ కందామా?' అనుకుంది. కానీ శుద్ధ దండగ అనిపించి 'మామూలు మనిషి తను' అని అప్పుడు తెలుసుకుంది. పాతిక వేలు టిక్కెట్లు అమ్మితే, యాభై వేల మంది వచ్చి వుంటారు. ఆ యాభై వేల మందిలో తాను ఏ మూల? ఒక ఇసుక రేణువు.

ఆట చూస్తూ కూర్చుంది.

## అభిప్రాయ వేదిక

### శేషేంద్ర నవల దుమారం

ఈ శతాబ్దిలో విశ్వనాథ తర్వాత చెప్పుకోతగ్గ ఒకే ఒక కవి శేషేంద్ర. శేషేంద్ర 'కామోత్సవ్' నవల వ్రాసినంత మాత్రాన ఆయన కవిత్వంయొక్క గొప్పతనం తగ్గదు. అసలు విప్లవంలాగే శృంగారం కూడా జీవితంలో చాలా ముఖ్యమైన భాగం. (ఇది లేకపోతే మనమంతా ఈనాడు ఈ భూమిమీద వుండం.) మావో కూడా ఒక అందమైన సినీమా స్టార్‌ను పెళ్ళి చేసుకున్న సంగతి మరిచిపోకూడదు!

సమాజంలో పేదల వర్గం ఒక్కటే కాదు, మధ్యతరగతి వర్గం వుంది, ధనిక వర్గమూ వుంది. మనకు పరిచయం లేనంత మాత్రాన ధనిక వర్గమూ, వాళ్ళ భోగ భాగ్యాలూ లేవనుకోవడం ఆత్మవంచన! ఆ ధనిక వర్గాన్ని పరిశీలించి శేషేంద్ర 'కామోత్సవ్' నవల వ్రాశారు. అందులో ఆధునిక కవిత్వం, ఆధునిక చిత్రకళలనుగూర్చి అనేక ముఖ్య విషయాలు వర్ణించారు. నగర జీవితాన్నీ, ధనికుల విలాసమయ కాముక క్రీడల్నీ అతి వాస్తవికంగా చిత్రించారు. ఈనాడు వస్తున్న నవలలతో పోలిస్తే ఇందులో అశ్లీలం ఏమీ లేదు. శేషేంద్ర కవిత్వాన్ని చూసి ఓర్వలేక, పాండిత్యానికి తట్టుకోలేక కుళ్ళుబోతు కుహనా విప్లవ రచయితలూ, కవులూ ఆయనమీద ధ్వజమెత్తారు. కుట్రపన్ని క్రిమినల్ కేసు పెట్టారు. విప్లవజపం చేసే ఈ మహారచయితలూ, కవులూ అందరూ ఆయనలాగే ఏదో ఉద్యోగం చేసి (చేస్తూ) పొట్టపోసుకుంటున్నవాళ్లే! ఈ వర్గ సమాజ వ్యవస్థలో బానిసలుగా వుంటూ నాలుగు రాళ్లు సంపాదించుకుంటున్న వాళ్లే! వీళ్లు తుపాకులు బుజాన వేసుకుని శ్రీకాకుళం అడవుల్లో తిరుగుతున్న వాళ్లు ఏ మాత్రం కాదు. (శ్రీశ్రీ అంతటివాడు కూడా తాను తన కలంతోనే విప్లవాన్ని సమర్థిస్తానని 'జ్వాల' పత్రిక ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పాడు.) అయినాసరే, ఈ 'విప్లవ కవులు' తామే నిజమైన విప్లవ కవులమనీ శేషేంద్ర 'కుహనా విప్లవకవి' అనీ అనడం, 'కామోత్సవ్' అశ్లీలం అనడం చూస్తే నవ్వొస్తోంది. శ్రీశ్రీ 'అనంతం'లో వీరికి అశ్లీలం ఏ మాత్రమూ కనబడక పోవడం ఇంకా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది!

ఆ రోజుల్లో విశ్వనాథను తిడితే 'అభ్యుదయ కవి' అయ్యేవాడు; ఈ రోజుల్లో శేషేంద్రను తిడితే 'విప్లవ కవి' అవుతున్నాడు. అదీ ఇదీ కూడా భ్రమే అన్న విషయం విజ్ఞులకు తెలుసు. వెర్రిపప్పవ గురివింద పూసకి తన క్రింద వున్న వెర్రిపప్పవ నలుపు తెలియదు కదా మరి! — తంగిరాల, బెంగుళూరు

### సినబ్బ కతలు

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు అన్నట్లుగా సినబ్బ కతలు ఒక్క పేజీ అయినా గాని మమ్ములను వారానికి ఒకసారి ఎంతో ఆనందంతో అలరింపచేస్తున్నాయి. సినబ్బ కతలు 'జ్యోతికే' ఒక హైలైట్.

— యర్రంశెట్టి వీరాస్వామి, నాగవేణి,
హైదరాబాద్

ఆఖరి రెండు ఓవర్లూ గవాస్కర్ తీసుకున్నాడు.

అతడు వేసే ప్రతి బంతి రోజర్ బిన్నీ సిక్సర్ కొట్టేస్తున్నాడు. బాల్ బౌండరీ లైన్ దాటి పడుతోంది.

గవాస్కర్ కాస్త ఆలోచించాడు.

బాల్ చేతిలో తిప్పుతూ వికెట్ల దాకా వచ్చి ఆగిపోయాడు. బహుశా గురి కుదరలేదేమో వెనక్కి వెళ్ళిపోయి మళ్ళీ వచ్చి ఆగిపోయాడు. ఈసారీ గురి కుదరలేదు.

అతడు ఆగి దూరంగా ఫీల్డింగ్‌లో వున్న 'అజారుద్దీన్‌ని బౌండరీ లైన్ దాటివెళ్ళి జనాల దగ్గర నిలబడమని' ఆదేశించాడు.

**'తాను విసిరే బంతిని రోజర్ బిన్నీ ఎలాగూ సిక్సర్ కొడతాడు. ఈసారి అజారుద్దీన్ చేతి నుంచి తప్పించుకోవడం కష్టం' అని గవాస్కర్ ఉద్దేశం.**

అలా ఆదేశించాక గవాస్కర్ వికెట్ల దగ్గర్నుంచి పదడుగులు వెనక్కి లెక్క పెట్టుకుంటూ వెళ్లాడు.

ఇకనైనా బంతి విసురుతాడేమోనని రోజర్‌బిన్నీ బాట్ సరి చేసుకుని నిలబడ్డాడు.

కానీ గవాస్కర్ ముందుకు రాకుండా అక్కడే కూర్చుని తాపీగా షూలేసులు బిగించుకుంటూ తాత్సారం చేశాడు.

రోజర్ బిన్నీని పూర్తిగా విసిగించి అప్పుడు బౌలింగ్ చేశాడు గవాస్కర్.

అతడి అంచనా తప్పలేదు.

రోజర్ బిన్నీ సిక్సర్ కొట్టాడు. బంతి ఎగురుకుంటూ వెళ్ళి అజారుద్దీన్ చేతిలో పడింది. అతడు ఇండియాను జయించినంత సంబరంగా గ్రౌండ్స్ లోపలకు వచ్చాడు.

అంతే......

గవాస్కర్ వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్ళి రోజర్ బిన్నీ చేతిలోని బ్యాట్ లాక్కుని అతడి నడుం మీద ఒక్కటేసి భుజం పుచ్చుకుని బయటకు తోసేస్తూ 'ఫో... వెళ్ళు...' అన్నాడు.

రోజర్ బిన్నీ వెళ్ళిపోయాడు.

### ముగింపు

"ఇంక లేవండి పోదాం" అంది సుకన్య.

"ఇంకా మాచ్ కాకుండానే:"

"ఇంకా నయం మాచ్ పూర్తయ్యేదాకా వుంటే విజయవాడ ఎల్లుండి వెళతాం!"

ఇక తప్పక అంతా లేచారు. వాళ్ళ కలలన్నీ కల్లలయ్యాయి. ఆశలన్నీ అడియాశలయ్యాయి.

అప్పుడు వినబడింది.

"హ...లో - మి...స్..."

అమ్మాయిలు తలలు వెనక్కి తిప్పి చూశారు.

అక్కడ సగం తెరిచి వున్న కిటికీ, కర్రల మధ్యగా కనిపించింది.

ఆ కిటికీ వెనక సగం ఆకారం "బూస్ట్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ" కనిపించాడు.

అమ్మాయిలు నోరు తెరవడం గమనించి కపిల్‌దేవ్ కంగారుగా "మిస్! అరవకండి!! అంతా చూస్తారు! గోల జరుగుతుంది" అన్నాడు రేపిడెక్స్ ఇంగ్లీష్‌లో

గాళ్ళు ఆశ్చర్యం ఆపుకుని చూశారు.

"ఇంతకు ముందు నేను అవుటయి వచ్చేస్తుంటే నా చొక్కా గుండీ ఒకటి ఊడి కింద పడిపోయింది. అది మా ఆవిడే అంటగుట్టింది. ఇప్పుడది లేకుండా వెళితే అంత బాగోదు. మా ఆవిడ అపార్థం చేసుకుంటుంది. ఆ గుండీ ఇప్పుడు మీరు కూర్చున్న కుర్చీ కిందే వుంది. ప్లీజ్ కొంచెం ఇస్తారా? అన్నాడు.

సుప్రియ, మాధవి మూర్ఛపోయారు.

గౌరి మంచినీళ్ళనుకుని వేడి టీ గటగటా తాగేసింది.

సుకన్య మాత్రం "అలా ఇస్తే మాకేంటి లాభం?" అంది.

"మీరే కోరుకోండి" అన్నాడు కపిల్‌దేవ్.

"మీతో కూడా మమ్మల్ని విజయవాడ తీసుకెళ్ళాలి!"

"సరే"

సుకన్య గుండీ తీసి ఇచ్చింది.

"మీరు వెనక్కి వచ్చెయ్యండి" అని చెప్పి కపిల్‌దేవ్ తలుపు వేసేసుకున్నాడు.

అమ్మాయిలు లేచారు. సరిగ్గా అప్పుడే మ్యాచ్ అయిపోయింది. జనాలంతా లేచారు. అప్పుడు మొదలైంది—

తొక్కిసలాట.

తోపులాట.

అంతా రద్దీ... ఇరుకు...

కదలడానికి వీల్లేనంత హడావుడి.

అలా ఎంతసేపు గడిచిందో..

గాళ్ళు బయటకొచ్చే సరికి సంజె చీకట్లు కమ్ముకొచ్చాయి.

గాలి ఉండి ఉండి జాలిగా పలకరించి పోతోంది.

కపిల్‌దేవ్ కనిపించలేదు.

దూరంగా అంటించిన 'సోమా' పోస్టర్లు మాత్రం రెపరెపలాడుతున్నాయి. లోకమంతా జాలిగా తమనే చూస్తున్నట్టనిపించింది.

ఆ సమయంలో...

"మి...స్... మి...స్... మి...స్..." అంటూ కందిరీగల రొదలా వినిపించింది.

అంతా సంభ్రమంగా చూశారు.

రవిశాస్త్రి ఆడీ కారు దూరంగా ఆగివుండడం కనిపించింది.

అందులోంచి గవాస్కర్, వెంగ్సర్కార్, కపిల్‌దేవ్, రమణ్‌లాంబా, అజారుద్దీన్, చేతన్ శర్మ, ఇంకా మిగతా వాళ్ళు దిగుతూ కనిపించారు.

### కొసమెరుపు

ఇదంతా నిజమనుకుంటున్నారా పిచ్చి నాన్నలూ! అంతా వుత్తిది!! గుంటూరు బస్ స్టాండులో విజయవాడ వెళ్ళడానికి బస్ టిక్కెట్ల కోసం క్యూలో నిలబడి సుప్రియ కన్న ఇంకో కల. ఇంకో విశేషమేమిటంటే ఆమె ఆటోగ్రాఫ్ పుస్తకం ఎవడో దొంగిలించేశాడు. దీన్నే క్రికెట్ భాషలో 'స్వీప్‌షాట్' అంటారు.

*